# పెద్దల రాజధాని కాదు
# ప్రజల రాజధాని కావాలి.

**సి.పి.ఎం**

### కొత్త రాజధాని, పాతవిధానాలు

రాష్ట్రం ముక్కలైంది. నవ్యాంధ్రలో మంచి రాజధాని నిర్మించాలని ప్రజలు ఆశిస్తున్నారు. ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని నమ్మించి మోడి, బాబు గద్దెనెక్కారు. తుళ్ళూరు ప్రాంతంలో 29గ్రామాలతో కోర్ కాపిటల్, గుంటూరు-కృష్ణాజిల్లాలోని 58మండలాలతో రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సి.ఆర్.డి.ఏ) ఏర్పర్చారు. ప్రభుత్వాలు మాటలతో కాలం వెళ్ళబుచ్చుతున్నాయి. గతంలో పాలకులు హైదరాబాద్ పైనే దృష్టిపెట్టారు. సంపదంతా అక్కడే కేంద్రీకరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారు. అసమానతలు పెరిగాయి. ప్రాంతీయ ఉద్యమాలు పుట్టాయి. ఒకే చోట అభివృద్ధి చేసే కేంద్రీకరణ విధానం విఫలమయింది. గుణపాఠం నేర్చుకుని నవ్యాంధ్ర రాజధాని వికేంద్రీకరణ దిశగా సాగాలి. కానీ చంద్రబాబు ప్రభుత్వం కొత్త రాజధాని అభివృద్ధికి పాతవిధానాల బాటలోనే సాగుతోంది. రాజధాని మాది అని రాష్ట్రప్రజలంతా భావించే రీతిగా అభివృద్ధి చేయడంలేదు. పాలకులు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా చూడాలి. రాజధానిలోనూ, రాష్ట్రంలోను అన్ని తరగతులకు అభివృద్ధి ఫలాలు అందాలి.

### ఆశ నిరాశల మధ్య రైతులు

రాజధాని వస్తే బాగుపడుతామని కోర్ కాపిటల్‌లోని 29గ్రామాల ప్రజలు ఆశపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇష్టంతో కొందరు, గత్యంతరం లేక మరికొందరు రైతులు 33వేల ఎకరాల భూమిని భూసమీకరణ (పూలింగ్) ద్వారా ఇచ్చారు. కొందరు రైతులు నష్టపోతామని భూములు ఇవ్వలేదు. భూమిలేని వారు ఉద్యోగాలు వస్తాయని సంతోష పడ్డారు. భూముల రేట్లు పెరిగాయి. ఇంకా పెరుగుతుందని కొందరు రైతులు భావించారు. భూమిపూజ తరువాత రేట్లు తగ్గి ఆశాభంగం చెందారు. భూమివ్యాపారం జూదంగా మారింది. 1600 ఎకరాల పట్టాభూమిని ఫారెస్టు భూమిగా చెప్పి మెలిక పెట్టారు. రైతులు ఆగ్రహించారు. అసైన్డ్, లంక భూములలో సాగుచేసుకుంటున్న దళితుల భూములు బలవంతంగా లాక్కోవడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. వీరి పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. పూలింగ్‌లో భూములు ఇవ్వని రైతుల భూమిని భూసేకరణ ద్వారా బలవంతంగా గుంజుకోవడానికి బెదిరింపులకు పాల్పడుతున్నారు. మోడీ తెచ్చిన భూఅర్డినెన్స్ చంద్రబాబు చేతిలో ఆయుధంగా మారింది. రైతుని బలిపశువును చేస్తున్నది.

### పేదలకు రాజధాని వరమా? శాపమా?

భూసమీకరణతో పనులు లేక కూలీలు రోడ్డున పడ్డారు. పూట గడవడంలేదు. కౌలురైతులు, చేతివృత్తిదారులకు దిక్కు తోచడం లేదు. పిల్లల చదువులు అర్ధంతరంగా ఆగుతున్నాయి. పైసా అప్పుపుట్టడం లేదు. డ్వాక్రారుణాలు రద్దు కాక, రుణం కట్టలేక మహిళలు దీనావస్థలో వున్నారు. పేదలకు నెలకు కుటుంబానికి 2500పెన్షన్ ఏప్రిల్ నుండి ఇస్తామన్నా పూర్తిస్థాయిలో అమలు జరగలేదు. కుటుంబం మొత్తం నెలకు 2500 రూపాయలతో ఎలా గడుస్తుంది? కనీసం ప్రతికూలీకి 9000రూపాయలు పెన్షన్ ఇవ్వాలని గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే దిక్కులేదు. సొంత ఇల్లు లేక అద్దెలు భరించలేకపోతున్నారు. ఉపాధి కొరకు శిక్షణ, ఇంటికోఉద్యోగం హామీగానే మిగిలింది. సి.ఆర్.డి.ఏ. పరిధి మొత్తంలో అద్దెలు పెరిగాయి. ట్రాఫిక్ నరకం చూపిస్తోంది. భూకబ్జాలు, నేరాలు పెరిగాయి. భవన నిర్మాణాలకు అడ్డంకులు కల్పిస్తున్నారు. కొత్త రకాల పన్నులకు కత్తులు నూరుతున్నారు. గ్రామకంఠాలకు 500 మీటర్లు దాటితే లేఅవుట్లు, నిర్మాణాలకు అనుమతులు ఆపేశారు. ఇలా రాజధాని ప్రకటించిన కొద్ది నెలలలోనే ప్రజలు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. రాజధాని వస్తే బాగుపడతామని భావించిన వారి ఆశలు నీరుగారిపోతున్నాయి.

**రాజధాని ప్రజలకా? కార్పొరేట్ కంపెనీలకా?**

3 పంటలుపండే పచ్చని పంటపొలాలు 55వేల ఎకరాలు, అదనంగా 28వేల ఎకరాల అటవీ భూమి రాజధానికి అవసరమా? ప్రభుత్వ భూములు, అటవీ భూములలో రాజధాని నిర్మించకూడదా? రైతుల భూములు లాక్కుని వ్యవసాయం దెబ్బతీయడం న్యాయమా? దేశంలో, ప్రపంచంలో ఏ రాజధానికైనా ఇంతభూమి తీసుకున్నారా? ఇలా ఎన్నో ప్రశ్నలు ఎందరో విజ్ఞులు లేవనెత్తినా పాలకులు పెడచెవిన పెట్టారు. రైతుల నుండి సమీకరించిన భూములను 99 సంవత్సరాల పాటు బడాకంపెనీలకు లీజుకు ఇవ్వడానికి జి.వో 110 విడుదల అయింది. రాజధాని నిర్వహణకు, నిర్మాణానికి కాపిటల్ సిటీ డెవలప్‌మెంట్& మెయింట్‌నెన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ జి.వో ఇచ్చారు. సింగపూర్ , జపాన్ కంపెనీలు రాజధాని నిర్మాణానికి ఉవ్విళ్ళూరుతున్నాయి. 55వేల ఎకరాల భూమిలోప్రభుత్వానికి వచ్చేది 7వేల ఎకరాలేనని వారే ప్రకటించారు. మరి మిగిలిన భూములు కార్పొరేట్ కంపెనీల పరమేనా? దేశీయ కంపెనీలు, నిపుణులు, తెలుగువారి భాగస్వామ్యం రాజధాని నిర్మాణంలో ఎందుకు కల్పించలేదు? రాజధాని ప్రణాళికా రూపకల్పన సింగపూర్‌వారు చేయాలా? దేశ విదేశాల్లో అమోహమైన ప్రతిభ అనేక రంగాల్లో మన ఇంజనీర్లుగా, ఐ.టి, వైద్య రంగ నిపుణులుగా అభినందనలు పొందుతుంటే దేశంలో ఇంజనీర్లు చేయలేరని ముఖ్యమంత్రిగారు వ్యాఖ్యానించడం దేశ నిపుణుల్ని, మేధావుల్ని కించపర్చడమే. రాజధాని కొరకు కేంద్రం నయాపైసా ఇవ్వడం లేదు. రాష్ట్రప్రభుత్వం నిధులు లేవని చేతులెత్తేసింది. రైతుల భూమి అమ్మి ఆ డబ్బుతో రాజధాని నిర్మించాలనుకోవడం దుర్మార్గం కాదా? రాజధాని ప్రజలకా? కార్పొరేట్లకా?

**ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే రాజధాని కావాలి.**

చంద్రబాబు ప్రభుత్వం విదేశీ కార్పొరేట్ కంపెనీల లాభాలకోసం, తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలు పట్టించుకోవడం లేదు. రాజధాని చుట్టూ రాజకీయం తిప్పి రాష్ట్ర అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజలను అణగతొక్కుతోంది. సరళీకరణవిధానాలతో స్మార్ట్ నగరాల నినాదాల ముసుగులో రాజధాని వ్యాపారం చేస్తోంది. ఇది తగదు.

మంచి రాజధాని కావాలి. ప్రజలు అందరూ మెచ్చే రాజధాని కావాలి. రాజధానితో పాటు రాష్ట్రమంతా బాగుపడాలి. అన్ని తరగతులు ప్రజల జీవితాలు మెరుగుపడాలి. ఆర్భాటపు ప్రకటనలు కట్టిబెట్టి ఉన్న వనరులతో మెరుగైన రాజధాని నిర్మించాలి. ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, వరదముంపు నివారించే రాజధాని అవసరం. ఉపాధి, అందరికీ అందుబాటులో ఇళ్ళు, పన్ను భారాలు లేని స్వపరిపాలన కావాలి. తక్షణం పేదలకు నెలకు 9వేల పెన్షన్ ఇవ్వాలి. పని చూపాలి. ఇళ్ళు కట్టాలి. బలవంతపు భూ సేకరణ ఆపాలి. పూలింగ్‌లో భూమి ఇచ్చిన రైతులకు గరిష్ట రేటు వచ్చే చోట ప్యాకేజీ ప్రకారం భూమి ఇవ్వాలి. డ్వాక్రా రుణాలు రద్దు చేయాలి. ఉపాధి శిక్షణ ఇవ్వాలి. ఇంటికో శాశ్వత ఉద్యోగం ఇవ్వాలి. దీనికై ప్రజా ఒత్తిడి కావాలి.

**కార్పొరేట్ నమూనాని వ్యతిరేకిద్దాం – ప్రజా రాజధానికై ఉద్యమిద్దాం. ఆగష్టు 14న జరిగే ధర్నాలో పాల్గొనాలని సిపియం విజ్ఞప్తి చేస్తున్నది.**

**తేది : 28.07.2015**

**అభివందనములతో....**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

**ఆంధ్రప్రదేశ్ కమిటీ**